సాక్షి
ఆదిలాబాద్

శనివారం । 13 । జనవరి । 2024



పతంగుల పండుగ షురూ..
ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. విద్యార్థులకు పండుగ సెలవులు కూడా ప్రకటించారు. చిన్నారులు పతంగుల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. 10లో▸



అ'పూర్వ' సమ్మేళనం
బోథ్: మండలంలోని కౌఠ(బి) జెడ్పీ ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం పొచ్చెర జలపాతం వద్ద అపూర్వ సమ్మేళనం నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
31.0 /18.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

ఇచ్చోడ: మండలంలోని గుండివాగు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. సరైన రోడ్డు సౌకర్యం లేనందున వానాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ఇందులో సర్పంచ్ దత్తురాం, గ్రామస్తులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. సిద్దిపేటలో జనవరి 13 నుంచి 16వరకు నిర్వహించనున్న ఫస్ట్ యూత్ నేషనల్ అండర్–19 చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు ఎంపికైన జ్యోతి, వసంత, అంజలి, గౌరీలను కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

అరుదైన వృక్ష సంపదను పరిరక్షించాలి



ఔషధ మొక్కలు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్: అరుదైన వృక్ష సంపదను పరిరక్షించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో రిటైర్డ్ ఎమ్మార్వో కమ్మల నరసింహులు పెంచిన ఔషధ మొక్కల పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై మొక్కలను పంపిణీ చేశారు. ఔషధ మొక్కలను పెంచి ఇతరులకు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కవి ఉదారి నారాయణ తదితరులున్నారు.

రైల్వేలైన్ సాధనకు 16 నుంచి రిలే దీక్షలు



మాట్లాడుతున్న నాయకులు

ఎదులాపురం: ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్ సాధించే వరకు అలుపెరుగని పోరాటం చేపడతామని ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైల్వేలైన్ జాప్యం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఖండిస్తున్నామన్నారు. రైల్వేలైన్ సాధనే లక్ష్యంగా రిలే దీక్షలు చేపట్టేందుకు కమిటీ నిర్ణయించిందన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవన సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద ఈనెల 16 నుంచి దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. ఇందులో కమిటీ గౌరవ అధ్యక్షుడు అశోక్, చైర్మన్ నారాయణ, నరేందర్, రవీందర్, వెంకటనారాయణ, దేవిదాస్, ఆశన్న, అఫ్సర్‌ఖాన్, శ్రీనివాస్, రాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి..లొల్లి!

- అర్ధంతరంగా నిలిచిన కొనుగోళ్లు
- జిన్నింగ్ మిల్లుల్లో స్థలం లేదన్న సీసీఐ
- ప్రైవేట్ వ్యాపారులదీ అదే తీరు
- మూడు గంటల పాటు రైతుల ఆందోళన
- రహదారిపై బారులు తీరిన బండ్లు
- ఎమ్మెల్యే, అధికారుల చొరవతో తిరిగి ప్రారంభం



ఆదిలాబాద్ మార్కెట్లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో యార్డులో బారులు తీరిన పత్తి వాహనాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు శుక్రవారం అర్ధంతరంగా నిలిచిపోయాయి. సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏలాంటి సమాచారం ఇవ్వకుండా కొనుగోళ్లు నిలిపివేయడంపై రైతులు ఆందోళన చేపట్టారు. ఉదయం 9గంటలకు ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. కేవలం 15 బండ్లు తూకం చేసిన అనంతరం సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. అయితే కొనుగోళ్లు ఎందుకు నిలిపివేశారో తెలియక రైతులు అయోమయానికి గురయ్యారు. దాదాపు 800 బండ్లు యార్డుకు వచ్చాయి. గురువారం రాత్రి నుంచే చుట్టుపక్కల మండలాలకు చెందిన రైతులు వాహనాలను యార్డు ప్రాంతంలో క్యూలో పెట్టడం గమనార్హం.

జిన్నింగ్‌లో స్థలం లేదని..

ఉదయం పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు వెనుకంజ వేశారు. ఆదిలాబాద్‌లో ప్రస్తుతం 18 జిన్నింగ్ మిల్లులను సీసీఐ అధికారులు లీజుకు తీసుకున్నారు. ఈ మిల్లుల్లో పత్తి, బేళ్ల నిల్వలు ఎక్కువయ్యాయని, దీంతో స్థలం లేక కొనుగోళ్లు ఆపేస్తున్నట్లు చెప్పేసి అక్కడినుంచి వెళ్లిపోయారు. కొనుగోళ్లు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనుగోళ్లు నిలిచిపోవడంతో మార్కెట్ యార్డు నుంచి రైల్వే గేట్ వరకు, అలాగే యార్డు వెనుక ప్రాంతంలో భారీగా పత్తి బండ్లు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కుఅంతరాయం ఏర్పడింది. కనీసం ద్విచక్ర వాహనం కూడా ఆ ప్రాంతం నుంచి వెళ్లలేని పరిస్థితి. విషయం తెలియడంతో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అక్కడికి చేరుకున్నారు. ప్రైవేట్ వ్యాపారులు, లారీ యజమానులను పిలిపించి చర్చలు జరిపారు. వ్యాపారులు, లారీ డ్రైవర్ల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. వారికి నచ్చజెప్పినా వినిపించుకోలేదు. తర్వాత కొద్ది సేపటికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అక్కడికి చేరుకున్నారు. వారికి నచ్చజెప్పడంతో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. ఇప్పటికే రైతులు దిగుబడి రాక, గిట్టుబాటు ధర అందక ఆందోళన చెందుతుంటే, వ్యాపారులు కొనుగోలు చేయకపోవడం, లారీ యజమానులు పత్తిని తరలించకుండా కావాలని ఇబ్బందులకు గురిచేస్తే ఉన్నతాధికారుల ద్వారా చర్యలు చేపడతామని హెచ్చరించారు.



మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు



వ్యాపారులు, లారీ అసోసియేషన్ నాయకులతో చర్చలు జరుపుతున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

వ్యాపారులు, యజమానుల మధ్య వాగ్వాదం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం లారీ డ్రైవర్లకు సంబంధించి రెండు చట్టాలను తీసుకొచ్చింది. దీంతో లారీ యజమానులతో పాటు డ్రైవర్లు సమ్మె చేపడుతున్నారు. పత్తి బేళ్లను ఇతర ప్రాంతాలకు తరలించకపోవడంతో జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు పేరుకపోయాయి. స్థలం లేకపోవడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, సీసీఐ వెనుకంజ వేస్తోంది. కాగా కావాలనే లారీ యజమానులు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని, దేశంలో ఎక్కడా సమ్మె జరగడం లేదని వ్యాపారులు తెలిపారు. ఆదిలాబాద్ నుంచి తమిళనాడుకు పత్తి బేళ్లను తీసుకెళ్లడానికి రూ.90వేలు అడుగుతున్నారని, ఇతర ప్రాంతాలకు చెందిన లారీలు రూ.50వేల నుంచి రూ.60వేలు మాత్రమే తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వాహనాలను లోడింగ్ చేయకుండా అడ్డుకుంటున్నారని, వీరు అధికంగా కిరాయి అగడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మార్కెటింగ్ ఏడీ కార్యాలయంలో లారీ యజమానులు, జిన్నింగ్ మిల్లుల వ్యాపారులతో చర్చలు జరిపినప్పుడు కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ తర్వాత కొనుగోళ్లు మొదలయ్యాయి.

'మడావి'ని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్‌టౌన్: ఆదివాసీ విద్యార్థులంతా మడావి తుకారాంను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో మడావి తుకారాం కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనవాసీ చరిత్ర బయటకు రా కుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని ఆరోపించారు. కార్యక్రమంలో పోనపల్లి సోమయాజులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూర్ విభాగం సంచాలకులు నిమ్మల ప్రతాప్, మడావి తుకారాం, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి, వనవాసీ కళ్యాణ పరిషత్ అధ్యక్షుడు సుదర్శన్, మహేశ్ పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



పతంగుల దుకాణాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: గాలిపటాల దుకాణ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా, నైలాన్ సింథటిక్ మాంజాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్ఓ వాహబ్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని గాలిపటాల దుకాణాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైనా మాంజాలతో వన్యప్రాణులు, పక్షులు, ఇతర జంతువులకు ప్రాణహాని ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. ఇందులో అటవీశాఖ అధికారులు గులాబ్‌సింగ్, సజన్‌లాల్, తదితరులున్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

బజార్‌హత్నూర్: ప్రజాపాలనలో భాగంగా అర్జీదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ను శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలో వందశాతం ఆన్‌లైన్ నమోదు పూర్తి కావడంతో ఎంపీడీవో రాథోడ్ రాధ, ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శిని అభినందించారు. మిగతా జీపీల పరిధిలోని దరఖాస్తులను కూడా త్వరితగతిన ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలన్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు,

వసతులు కల్పించండి

బోథ్: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బోథ్‌కు వచ్చిన అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయి ఐదేళ్లు గడచినా ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదన్నారు. అలాగే స్థానిక తైబజార్‌లో కనీస వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, షేక్ అబూద్, నాసర్ అహ్మద్, రవి, నారాయణ తదితరులున్నారు.



ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా


బోథ్‌లో..

బోథ్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం పరిశీలించారు. గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనంతరం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అదనపు కలెక్టర్‌ను కలిశారు. పలు విషయాలపై చర్చించారు. ఆమె వెంట ఎంపీడీవో సునీల్ రెడ్డి, ఎంపీవో జీవన్‌రెడ్డి ఉన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కైలాస్‌నగర్: పెండింగ్ బిల్లులతో పాటు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి మరీ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నామన్నారు. ప్రభుత్వం తమ ఆవేదనను గుర్తించడంతో పాటు పండగ దృష్టిలో ఉంచుకుని వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. ఈ మేరకు కలెక్టర్, డీఈవో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్నన్న, లక్ష్మి, రాజవ్వ, ప్రమీళ, సంగీత, దేవత, జబ్బార్, భూదేవి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

స్వామి వివేకానంద.. స్ఫూర్తి ప్రదాత

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

కైలాస్‌నగర్: స్వామి వివేకానందుని జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత దేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువత చేతుల్లోనే ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో వంద శాతం తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు నమోదుపై అధికారులు, యువతతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతీయ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసపత్రం, మెమెంటో ప్రదానం చేశారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, డీపీఆర్వో విష్ణువర్ధన్, కళాకారులు, యువజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హస్నాపూర్‌లో..

ఉట్నూర్‌రూరల్: నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని హస్నాపూర్‌లో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు యువకులు రక్తదానం చేశారు.




ప్రశంసపత్రాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ రాహుల్‌రాజ్

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు


ఆదిలాబాద్: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్‌లో ఏర్పాటు చేసిన జాతీయ యువజన దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వివేకానందుని విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలన్నారు.

ట్రావెల్స్ యజమానికి ప్రశంస

ఎదులాపురం: జీఎస్ఆర్ ట్రావెల్స్ యజమాని ప్రమోద్‌కుమార్ ఖత్రికి కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రశంస పత్రం అందించారు. జాతీయ యువజనోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జెడ్పీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సదరు ట్రావెల్ యజమానికి ప్రశంసించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు విద్యార్థులను తీసుకువచ్చేందుకు గత కొన్నేళ్లుగా ట్రావెల్ యజమాని ఉచిత బస్సు సౌకర్యం కల్పించడాన్ని అభినందిస్తూ ప్రశంసించి, పత్రం అందజేశారు.



రక్తదాన శిబిరంలో జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆధార్ అనుసంధానం ఉపసంహరించుకోవాలి

ఎదులాపురం: మోదీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ కూలీలకు ఆధార్ అనుసంధానాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ అనుబంధం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, లంకా రాఘవులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. వామపక్షాల ఒత్తిడి కారణంగా 2005లో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతం అభివృద్ధి చెందిందని, వ్యవసాయ కూలీలకు ఉపాధి లభించిందని, వలసలు తగ్గుముఖం పట్టాయన్నారు. రైతులు, కూలీలు, గ్రామీణ పేదలకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. అయితే మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్లుగా ఉపాధి హామీకి బడ్జెట్ తగ్గిస్తుండటమే కాకుండా, కొత్త నిబంధనలు తీసుకొస్తూ కూలీల సంఖ్య తగ్గించాలని, పథకాన్ని నీరుగార్చి, రద్దు చేయాలని కుట్రలు పన్నుతుందన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం, పథకం పరిరక్షణ కోసం కలిసి వచ్చే సంఘాలతో ఐక్య ఉద్యమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇందులో సీఐటీయూ నాయకులు అన్నమొల్ల కిరణ్, దర్శనాల మల్లేశ్, నాయకులు చిన్నన్న, ఐద్వా నాయకురాలు మంజుల, శకుంతల, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సక్కు, రైతు సంఘం నాయకులు దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాఘవులు

ఆక్రమణలపై చర్యలేవి?

- నోటీసుల జారీకే బల్దియా పరిమితం
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

కైలాస్‌నగర్: 'మున్సిపల్ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మీరు చేపట్టిన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధం. ఈ నోటీసు అందిన ఏడు రోజుల్లోగా అక్రమ నిర్మాణాలపై సరైన వివరణ ఇవ్వడంతో పాటు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు చూపాలి. లేకుంటే తదుపరి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఆ నిర్మాణాలను కూల్చివేస్తాం..' ఇది గతేడాది డిసెంబర్ 11న మున్సిపల్ కమిషనర్ శైలజ ఓ అక్రమ నిర్మాణదారుడికి జారీ చేసిన నోటీసులోని సారాంశం. అయితే నోటీసు అందించి నెల గడిచినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

డిమాండ్ ఏరియా కావడంతో...

జిల్లా కేంద్రంలోని న్యూహౌసింగ్‌బోర్డు పరిధిలో పాత జాతీయ రహదారికి ఆనుకుని సర్వేనంబర్ 161/ఏలో ఓ వ్యక్తి మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వ్యాపార మడిగెలను నిర్మిస్తున్నాడు. మున్సిపల్ స్థలంతో పాటు రోడ్డు స్థలాన్ని ఆక్రమించి మరీ పనులు చేపట్టాడు. నిర్మాణం తుది దశకు చేరిన క్రమంలో మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు పనులు నిలిపివేసినప్పటికీ, తదుపరి చర్యలు లేకపోవడంతో సదరు వ్యక్తి కోర్టును ఆశ్రయించే ప్రయత్నాల్లో ఉన్నట్లుగా తెలుస్తోంది.

అక్రమమని తెలిసినా చర్యలకు వెనుకంజే

మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన వ్యాపార సముదాయ మడిగెల నిర్మాణాలు అక్రమమేనని నోటీసులు జారీచేసిన బల్దియా అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నోటీసులు అందిన ఏడు రోజుల్లో వాటిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన వారు, నెల గడిచిన మౌనంగా ఉండటం వెనుక అంతర్యమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే వీటిపై చర్యలు చేపట్టకుండా విపక్ష పార్టీకి చెందిన ఓ వార్డు ప్రజా ప్రతినిధి అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై కమిషనర్‌ను వివరణ కోరగా.. జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ దృష్టికి తీసుకెళ్లాం. ఆ కమిటీ ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పడం గమనార్హం.

క్లుప్తంగా

మిస్సింగ్ కేసు నమోదు


సింధూజ (ఫైల్)

సారంగపూర్: మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన బోండ్ల సింధూజ గత నెల 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. సింధూజ గత నెల 28న బట్టలు కొనుక్కునేందుకు నిర్మల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి డబ్బులు వెంట తీసుకెళ్లింది. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం పోలీసులకు యువతి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అయోధ్యకు రావాలని పలువురికి ఆహ్వానం

బజార్‌హత్నూర్: అయోధ్యలోని శ్రీరామమందిరంలో ఈ నెల 22న నిర్వహించనున్న బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు రావాలని మండల కేంద్రానికి చెందిన బొజ్జవార్ సంతోష్, బొజ్జవార్ వీరనందయ్య, పండరిని అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రత్యేకంగా ఆహ్వానించింది. గతేడాది వీరు బజార్‌హత్నూర్ నుంచి అయోధ్య వరకు పాదయాత్ర నిర్వహించారు. జిల్లా నుంచి 18మందికి ఆహ్వానాలు రాగా, ఇందులో ముగ్గురు మండల వాసులు కావడం గమనార్హం.

కుంటాలలో చోరీ

కుంటాల: మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. కుంటాలకు చెందిన పండెన శ్రీనివాస్ పదో వార్డులో భార్య అశ్వితతో కలిసి ఆరు నెలలుగా అద్దెకుంటున్నాడు. శ్రీనివాస్ తల్లి ఎర్రవ్వ సారంగాపూర్ మండలం తాండ్రకు వెళ్లింది. దీంతో ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి సొంతింటికి వెళ్లి అక్కడే నిద్రించారు. ఇల్లుకు తాళం వేసి ఉండడంతో గమనించిన దుండగులు దానిని పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువా తాళం తీసి అందులో అర తులం బంగారం, 10 తులాల వెండి, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల వేతనాలు విడుదల

లక్ష్మణచాంద: జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న 702 మంది ఉద్యోగులకు గత నవంబర్, డిసెంబర్‌లో వేతనాలు రాలేదు. దీంతో వారు పడుతున్న ఆర్థిక ఇబ్బందులపై 'సాక్షి'లో ఈ నెల 8న 'సారూ జీతాలు వస్తలేవ్' శీర్షికన ప్రచురించింది. గురువారం సాయంత్రం ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ఖాతాల్లో ఒక నెల వేతనం జమ చేసింది. దీంతో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అటవీ అధికారులకు జింక అప్పగింత


పట్టుకున్న జింకతో నాగాపూర్ గ్రామస్తులు

పెంబి: మండలంలో నాగాపూర్ గ్రామంలోకి శుక్రవారం ఉదయం అడవి కుక్కలు జింకను తరుముకుంటూ వచ్చాయి. గ్రామస్తులు వాటిని తరిమి జింకను కాపాడారు. వెంటనే ఖానాపూర్ రేంజ్ అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన అటవీ సిబ్బందికి జింకను అప్పగించారు. జింక కాలుకు గాయం కావడంతో ఆస్పత్రికి తరలిస్తామని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఎస్‌వో శ్రీలత తదితరులున్నారు.

పతంగుల పండుగ షురూ..

- సంక్రాంతివేళ గాలిపటాల జోరు
- ఉమ్మడి జిల్లాలో సందడే సందడి
- షాపుల్లో వివిధ ఆకృతుల్లో లభ్యం
- ఎగురవేసేటపుడు జెర భద్రం...
- అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలే..

నిర్మల్‌ఖిల్లా: ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. విద్యార్థులకు పండుగ సెలవులు కూడా ప్రకటించారు. ఈ నెల 12నుంచి 18వ తేదీ వరకు సెలవులు ఇవ్వడంతో ఎక్కడెక్కడో చదువుకుంటున్న వారంతా ఇళ్లకు వచ్చేశారు. ఇక మార్కెట్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన పతంగులు కనువిందు చేస్తున్నాయి. చిన్నారులు పతంగుల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. ప్రతీ ఏడాది మాదిరిగానే పతంగుల జోరు కొనసాగుతున్నది. చిన్నా పెద్దా తేడా లేకుండా ఎగురవేసే అనేక రకాల గాలిపటాలతో నింగి అంతా బహుళవర్ణంతో తేజోమయమవుతోంది. సంక్రాంతి పండుగ మన ఇళ్లల్లో కాంతులు నింపాలి గాని విషాదాన్ని కాదు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ పతంగులు ఎగురవేసి పండుగ ఆనందంగా జరుపుకోవాలి. ఈ నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న కథనం..


జిల్లాకేంద్రంలో పతంగులు కొంటున్న బాలురు


గాలిపటాలు ఎగురవేస్తున్న యువకులు

ఆనందం.. కారాదు విషాదం

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చిన్నారుల నుంచి యువకుల వరకు అందరికీ గుర్తుకు వచ్చేది పతంగులు ఎగురవేయడం. అలాంటి పండుగ ఆనందంగా జరుపుకోవాలంటే చిన్నారులు తప్పకుండా జాగ్రత్తలు పాటించాల్సిందే. పండుగ మూడు రోజులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చిన్నారులు మూడు నుంచి ఐదు రోజుల పాటు పతంగులు ఎగురవేస్తుంటారు. వారు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పతంగులు ఎగురవేసే చిన్నారులు, యువకులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

విపణిలో విభిన్న రంగుల్లో..

గరుడ పక్షి, కప్ప, విమానం, చేప, పులి, ఫ్రీ ఫైర్, చోటా భీం, డోరా బుజ్జీ, అవేంజర్స్, చెష్మా చిత్రాలతో ఉన్న అనేక రకాల పతంగులను అమ్మకానికి పెట్టారు. దీంతో చిన్నారులు ఆసక్తిగా తిలకిస్తూ కొనుగోలు చేస్తున్నారు. దుకాణాదారులు రూ.5నుంచి రూ.300 విలువజేసే పతంగులను అందుబాటులో ఉంచారు. 300 నుంచి 400 మీటర్ల కాటన్ దారాన్ని రూ.20కి, నైలాన్ దారాన్ని రూ.50కి విక్రయిస్తున్నారు. కట్టెతో తయారు చేసిన చరకలు రూ.80 నుంచి రూ.200 వరకు ఉండగా, ప్లాస్టిక్ చరక రూ.40 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. కాగా, మార్కెట్‌లో అక్కడక్కడా నిషేధిత చైనా మాంజా అందుబాటులో ఉన్నట్లు సమాచారం.

మాంజా వద్దే వద్దు

నైలాన్, చైనీస్, గ్లాస్ కోటెడ్ ఉన్న కాటన్ మాంజాలపై నిషేధం కొనసాగుతోంది. పక్షులు, జంతువులకే కాదు మనుషులకూ ప్రమాదం ఉంటుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పతంగులు ఎగురవేసేందుకు మాంజా కాకుండా సాధారణ దారాన్నే వినియోగించాలని వారు సూచిస్తున్నారు.

మరిన్ని సూచనలు

- పతంగులు డాబాలపై ఎగురవేయవద్దు.
- చుట్టూగోడలు లేని ఇండ్లపై అసలే వద్దు. తప్పనిసరైతే పెద్దల సమక్షంలో ఎగురవేయాలి.
- రద్దీ ప్రాంతాల్లో గాలిపటాలు ఎగురవేస్తే ప్రమాదాలు జరిగే అవకాశముంది.
- అతి ఎత్తైన ప్రదేశాల్లో పతంగులు ఎగురవేయడం మానుకోవాలి.
- గాలిపటాలు తెగిపోయినప్పుడు చిన్నారులు వాటికోసం పరుగులు తీసే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయి.
- పతంగులకు ఉపయోగించే దారం మాంజా సీసం, వివిధ రకాల కెమికల్స్‌తో తయారు చేయడంతో అవి చాకులా కోసుకునే అవకాశాలు ఎక్కువ.
- దారం తెగి విద్యుత్ తీగలకు గాని, చెట్టుకొమ్మలకు గాని చుట్టుకున్నప్పుడు వాటిని తీసే సాహసం చేయరాదు.
- దగ్గరలోని ఖాళీ ప్రదేశాలు, మైదానాలు ఎంచుకుని పతంగులను ఎగురవేస్తే పండుగ మరింత ఆనందంగా ఉంటుంది.
- పతంగులను ఎగురవేసేటప్పుడు చిన్నారులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి.
- అత్యంత ప్రమాదకరమైన చైనా మాంజాను ఉపయోగించి పతంగులు ఎగురవేయరాదు.

విద్యుత్‌శాఖ సూచనలు..

- విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నచోట పతంగులు ఎగురవేయక పోవడమే శ్రేయస్కరం.
- విద్యుత్ వైర్లకు పతంగులు తగిలి చుట్టుకోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశముంది.
- విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు లేని ఖాళీ ప్రదేశాల్లో పతంగులు ఎగురవేయాలి.

జాగ్రత్త వహించాలి



సంక్రాంతి పండుగ నేపథ్యంలో సెలవులు రావడంతో పిల్లలు సంతోషంగా పతంగులు ఎగురవేస్తుంటారు. పెద్దవారు వెనకే ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి. గాలిపటాల దారం తెగి చెట్లు, విద్యుత్ స్తంభాలు, తీగలకు చిక్కుకున్నప్పుడు కొంతమంది కర్రలతో కొట్టడం లాంటివి చేస్తుంటారు. అలా చేయడం చాలా ప్రమాదకరం. పెద్ద బిల్డింగ్‌లపై పతంగులు ఎగురవేయడం.. దారం తెగిన పతంగులను పట్టుకునేందుకు పరిగెత్తడం లాంటివి చేయకుండా పిల్లలకు తగిన సూచనలివ్వాలి. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, వీధుల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, పాడుబడిన బావులు, పెద్ద గుంతల వద్ద ఎట్టి పరిస్థితిలో పతంగులు ఎగురవేయనివ్వకూడదు.

– జయవంత్‌రావు చౌహాన్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, నిర్మల్

గిరాకీ బాగుంది



మూడేండ్లుగా పతంగులు, దారాలు విక్రయిస్తున్న. ఈ సంవత్సరం పతంగుల కొనుగోళ్లు పెరిగాయి. రూ.60వేలతో పతంగుల స్టాల్ పెట్టాను. హైదరాబాద్ నుంచి పతంగులు తీసుకువచ్చి ఇక్కడ అమ్ముతున్నాను. మా దగ్గర రూ.5 నుంచి రూ.200 వరకు ధరల్లో పతంగులు ఉన్నాయి.

– కిరణ్, దుకాణాదారు, నిర్మల్

పర్యవేక్షణ తప్పనిసరి



చిన్నపిల్లలు గాలిపటాలు ఎగురవేసే క్రమంలో ఇంటి డాబాలపై ప్రమాదకరంగా పరుగెడుతుంటారు. దారం తెగిన పతంగులను అందుకునేందుకు పైకి చూసి పరిగెడతారు. ఇలాంటి క్రమంలో పడిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఇక మాంజా దారాలతో కూడా చేతివేళ్లు మెడ వంటి సున్నిత భాగాలు కోసుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని పర్యవేక్షిస్తూ పండుగ సెలవుల్ని ఆనందంగా గడపాలి.

– శశికాంత్, వైద్యుడు, నిర్మల్

యువకవి పోలీస్ భీమేశ్‌కు ఉత్తమ పురస్కారం



పురస్కారాన్ని స్వీకరిస్తున్న భీమేశ్

నిర్మల్ ఖిల్లా: జిల్లాకు చెందిన యువకవి, కళాకారుడు పోలీస్ భీమేశ్‌కు హైదరాబాద్ నేషనల్ ప్రీమియర్ అవార్డ్స్, రవిశ్రీ సంస్థ ఆధ్వర్యంలో 'ఉత్తమ యువ రచయిత పురస్కారం' లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ వేదికగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్మల్ రూరల్ మండలం అనంతపేటకు చెందిన యువకవి పోలీస్ భీమేశ్.. ఐఏఎస్ అధికారి చింతల శ్రీనివాస్, జబర్దస్త్ ఫేమ్ షేకింగ్ శేషు చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. పలు సామాజిక మాధ్యమాల్లో తనదైన శైలిలో రచనలు చేస్తూ, పలు కళల్లో ప్రదర్శిస్తున్న నైపుణ్యాలకు గాను ఈ ప్రీమియర్ పురస్కారాన్ని అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ యువపురస్కారం రావడం ఆనందంగా ఉందని భీమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు కవులు, సాహితీవేత్తలు, కళాకారులు అతడికి అభినందనలు తెలిపారు.

పీవీటీజీల సమస్యలు పరిష్కరించాలి


పీవోకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ బిరుదల్ గోండ్ తోటి పీవీటీజీల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఆదివాసీలు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుడు మర్సుకోల తిరుపతి మాట్లాడారు. పీవీటీజీ కులస్తులకు పక్కా గృహాలు నిర్మించాలని, పీవీటీజీ గ్రామాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని మండలంలోని ఆదివాసీ బిరుదుగోండు తోటి కులస్తులు ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇవ్వగా పీవో సానుకూలంగా స్పందించారు. రాంజీగోండ్ నగర్ పటేల్, కాత్లే హుస్సేన్‌రావు, కాత్లే సుంగు, గోడం ఆశివ్, కాత్లే ప్రవీణ్ తదితరులున్నారు.

నిర్మల్ జిల్లా రైస్‌మిల్లర్లకు గోదాం కేటాయింపు


గోదాం ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన సంగతి తెలిసిందే. నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి ఇవ్వడంలో వెనుకబడ్డారు. వానాకాలం సాగుకు సంబంధించి ఇప్పటివరకు వారు తమకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోలేదు. మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ నెల 31వ తేదీకి తుది గడువు విధించింది. ఈ నేపథ్యంలో బియ్యం సేకరించేందుకు వీలుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలను కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం పరిశీలించారు. రైస్‌మిల్లర్ల కోసం 8వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన నూతన ఎఫ్‌సీఐ గోదాం పాయింట్‌ను కేటాయించారు. ప్రత్యేక పూజలు చేసి బియ్యం నిల్వలను ప్రారంభించారు. గడువులోపు పూర్తిస్థాయిలో బియ్యం సేకరించాలని ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్‌ను ఆదేశించారు. ఆయన వెంట డీఎస్వో కిరణ్‌కుమార్, సీడబ్ల్యూసీ మేనేజర్ కిరిట్ తదితరులున్నారు.




నిరుపయోగంగా హరిత హోటల్

నిర్మల్ జిల్లా కేంద్రంలో శ్యామ్‌గఢ్ కోట ఆవరణలో తెలంగాణ పర్యాటకశాఖ రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన హరిత హోటల్ నిర్వహణ లేక నిరుపయోగమైంది. రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కోట చుట్టూ ఖాళీ స్థలం లారీలకు అడ్డాగా మార్చేశారు. సంబంధిత అధికారులు స్పందించి హరిత హోటల్‌ను వినియోగంలోకి తేవాలని జిల్లావాసులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్




చెరువులు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

- లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఎవరైనా బఫర్ జోన్ పరిధిలోని చెరువులను ఆక్రమిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని కలెక్టర్ కిశోర్‌కుమార్ హెచ్చరించారు. లేక్ ప్రొటెక్షన్ (సరస్సు రక్షణ) కమిటీ సమావేశం శుక్రవారం తన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణ కమిటీలో అడిషనల్ ఎస్పీ, డీఆర్డీవో ఇరిగేషన్ ఈఈ, ఏడీ సర్వేలాండ్, మున్సిపల్ కమిషనర్ ఉంటారన్నారు. జిల్లాలో చెరువులు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు ఈ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చెరువులు ఆక్రమించిన వారిపై ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యాయన్నారు. జలవనరులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వాటి పరిరక్షణ కోసం అదనపు కలెక్టర్ రెవెన్యూ నేతృత్వంలో కమిటీ సభ్యులతో కలిసి చెరువులను పరిశీలించి వాటి ఎఫ్‌టీఎల్, సర్వే నంబర్లను గుర్తించి నివేదిక అందిస్తామని వివరించారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ గంగాధర్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇరిగేషన్ ఈఈ రామారావు, ఏడీ సర్వేలాండ్ సుదర్శన్, కడెం ఈఈ, మున్సిపల్ కమిషనర్ సీఎస్.రాజు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ తీరుపై అధ్యాపకుల నిరసన

- డీఐఈవో జోక్యంతో సమసిన వివాదం


నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ అధ్యాపకులు శుక్రవారం నిరసన తెలిపారు. విధులు బహిష్కరించి కళాశాల ప్రాంగణంలో బైఠాయించారు. ప్రిన్సిపాల్ జూఫిషాన్ సుల్తానా విద్యార్థుల ముందే తమను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని అధ్యాపకులు ఆరోపించారు. ప్రిన్సిపాల్ వేధింపుల నుంచి విముక్తి కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డీఐఈవో పరశురాం కళాశాలకు చేరుకుని ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఇరువర్గాలకు సర్దిచెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాజేశ్వర్

సారంగపూర్: సాయినగర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధని గ్రామానికి చెందిన రాజేశ్వర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధని గ్రామానికి చెందిన లస్మన్నతో కలిసి రాజేశ్వర్ టీవీఎస్ ఎక్స్ఎల్‌పై జామ్ గ్రామానికి వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో ఎదురుగా రివర్స్ తీసుకుంటున్న ట్రాక్టర్ దగ్గరకు చేరుకున్నారు. గమనించని ట్రాక్టర్ డ్రైవర్ వెనుకవైపు రివర్స్ తీయడంతో వెనుకున్న రాజేశ్వర్‌కు గాయాలయ్యాయి. లస్మన్న ద్విచక్ర వాహనం పైనుంచి పక్కకు పడగా ప్రమాదం తప్పింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో రాజేశ్వర్‌ను ఆస్పత్రికి తరలించారు.

ఖోఖో క్రీడాకారుడికి సన్మానం


క్రీడాకారుడిని సన్మానిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఖేలో ఇండియా జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థి మెస్రం అంజన్నను శుక్రవారం ఉట్నూర్ క్రీడా పాఠశాల మైదానంలో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సన్మానించారు. ఖేలో ఇండియా పోటీలకు తొలిసారిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అంజన్నకు అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, క్రీడల అధికారి పార్థసారథి ఉన్నారు.

ఐఎస్ఎల్ శిబిరాల పరిశీలన

ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో నిర్వహిస్తున్న ఐఎస్ఎల్ క్రీడా శిబిరాలను ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సందర్శించారు. క్రీడాకారులకు అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. శిక్షణ తీరుపై ఆరా తీశారు. పోటీలకు ఇంకా మూడు రోజులే ఉన్నందున శిక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. స్టార్ సొసైటీ అన్ని అంశాల్లో ముందుండాలని కోరారు. అనంతరం మైదానాల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్రీడాకారులకు గాయాలు కాకుండా చూడాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలాలను పరిశీలించి పూలాజీ బాబా మైదానాన్ని ఎంపిక చేశారు. భోజనాల కోసం ఏర్పాటు చేసిన గిరిజన బాలికల గురుకుల కళాశాల మైదానాన్ని సందర్శించారు. 10 కౌంటర్లు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలుపగా, భోజనాల వద్ద పారిశుధ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీవో ఆదేశించారు. డీడీ దిలీప్‌కుమార్, ఆర్సీవో గంగాధర్, గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవో క్రాంతి, ప్రధానోపాధ్యాయుడు ఉత్తమ్, అధికారులు హేమంత్, గోపాల్, లక్ష్మణ్, రవీందర్, జల్పతి, రత్నం తదితరులున్నారు.

పాముకాటుతో బాలిక మృతి


కల్పన (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): పదేళ్ల బాలికకు పాముకాటుతో నూరేళ్లు నిండాయి. ఈ విషాదకర ఘటన శుక్రవారం కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండల కేంద్రంలోని మజీద్‌వాడలో నివాసం ఉంటున్న బావునె సునీత, విలాస్ దంపతులకు కుమారుడు, కుమార్తె కల్పన (10) ఉన్నారు. కల్పన స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. శుక్రవారం విలాస్ చౌపన్ గూడకు పని కోసం వెళ్లగా, తల్లితో కలిసి బాలిక ఇంట్లోనే ఉంది. బెడ్‌పై పడుకుని ఇంటి గోడ సెల్ఫ్‌లపై కాళ్లు పెట్టి సెల్‌ఫోన్‌తో ఆడుకుంటుండగా మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఓ విషసర్పం కల్పన ఎడమ కాలు బొటన వేలి కింద కాటేసింది. దీంతో కాలును గట్టిగా కదపడంతో బెడ్ బలంగా తాకి తీవ్ర రక్తస్రావమైంది. ఇంట్లోనే ఉన్న తల్లి గమనించినా కాలుపై రక్తం ఎక్కువగా ఉండటంతో పాముకాటు పసిగట్టలేకపోయింది. ఆ తర్వాత విషయం తెలుసుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లింది. అనంతరం ఆసిఫాబాద్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కల్పన తండ్రి విలాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

15నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

పాతమంచిర్యాల: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి పోటీలను ఆసిఫాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈ నెల 15,16,17 తేదీల్లో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పాత 10 జిల్లాల నుంచి 10 బాలికల జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని వివరించారు.